క్లుప్తంగా

మందకృష్ణను కలిసిన శంకర్‌పల్లి నాయకులు



మందకృష్ణతో నాయకులు

శంకర్‌పల్లి: ఇటీవల ఢిల్లీ నుంచి హైదరాబాద్ చేరుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శంకర్‌పల్లి ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్ మాట్లాడుతూ.. మందకృష్ణ ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేసిన యోధుడని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగ ఉపకులాలకు పెద్దఎత్తున లబ్ధి చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, పరశురాం తదితరులు ఉన్నారు.

పుస్తెమెట్టెలు అందజేత

కేశంపేట: పేదింటి అమ్మాయిల పెళ్లిళ్లకు మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి పుస్తె, మెట్టెలను ఆదివారం అందజేశారు. మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామానికి చెందిన అబ్బి లక్ష్మయ్య పద్మ, గౌతాపురం రాంచంద్రయ్య రాణి దంపతుల కుమార్తెల వివాహాల నిమిత్తం మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి పుస్తె, మెట్టెల అందజేశారు. కార్యక్రమంలో తాండ్ర విజయలక్ష్మి, నరేందర్, శేఖర్‌రెడ్డి, కుమ్మరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కేశంపేట: మండల పరిధిలోని వేములనర్వ గ్రామానికి చెందిన డొల్ల రాములు శనివారం మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం మాజీ జెడ్పీటీసీ తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లేశ్‌యాదవ్, రమేశ్, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయండి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో నేటి నుంచి ప్రారంభమయ్యే 41వ వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని ఆ ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం అన్నారు. ఆదివారం ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం (నేడు) స్వస్తి పుణ్యావచనము, అభిషేకం, గణపతి హోమం, మహానైవేద్యం, హారతి, తీర్థప్రసాద వితరణ, రావిర్యాలలో ఘటము ఊరేగింపు, మంగళవారం ఆలయ వద్ద అమ్మవారి కల్యాణోత్సవం, అగ్నిగుండములు, అన్నదాన కార్యక్రమం, పోతురాజుల విన్యాసాలు, బోనాలు, రావిర్యాల నుంచి ఆలయం వరకు ఘటము ఊరేగింపు, బుధవారం నివేదన, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణతో ఉత్సవాలు ముగుస్తాయని ఆయన తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అద్దె భవనాలు.. అరకొర వసతులు

- పదేళ్లు కావొస్తున్నా సొంత కార్యాలయాలు కరువు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, సిబ్బంది
- పట్టించుకోని అధికారులు



2022లో పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ కుశాల్కర్ (ఫైల్)



జీపీ భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

కొందుర్గు: మండలాల విభజన ఏర్పడి పదేళ్లు కావొస్తున్నా ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. మండల విభజనలో భాగంగా అప్పటి ప్రభుత్వం 2016లో కొందుర్గు మండలం నుంచి కొత్తగా చౌదరిగూడ మండలం ఏర్పడింది. గతంలో ఉమ్మడి కొందుర్గు మండలం ఉన్న సమయంలో 29 గ్రామ పంచాయతీలు ఉండేవి. కాగా నూతన పంచాయతీలు ఏర్పడిన అనంతరం 46 గ్రామ పంచాయతీలు ఏర్పడ్డాయి. అయితే కొందుర్గు మండలానికి 22 గ్రామ పంచాయతీలు, జిల్లేడ్ చౌదరిగూడ మండలానికి 24 గ్రామపంచాయతీలు కేటాయించి జిల్లేడ్ చౌదరిగూడ మండలాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. అప్పట్లో ప్రభుత్వ భవనాలు లేకపోవడంతో అద్దె భవనాల్లో ప్రభుత్వ కార్యాలయాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా తహసీల్దార్ కార్యాలయాన్ని గ్రామ పంచాయతీ భవనంలో, మండల పరిషత్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల్లో సరైన వసతులు లేక ప్రజలు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు జిల్లేడ్ గ్రామ శివారులో సర్వే నెంబర్ 142లో స్థల పరిశీలన చేశారు. కానీ నేటికీ ప్రభుత్వం భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రభుత్వ కార్యాలయాలన్ని అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనైనా ప్రభుత్వ కార్యాలయాలకు నిధులు మంజూరై సొంత భవనాలు ఏర్పడుతాయో లేదోనని మండల ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి



విద్యార్థులకు బెల్టులు, ధ్రువపత్రాలు అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ, మాస్టర్లు

షాద్‌నగర్: విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని ట్రాఫిక్ ఎస్ఐ రవీందర్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలోని పద్మావతి కన్వెన్షన్ హాల్‌లో న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన వారికి బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఆత్మరక్షణ కోసం యుద్ధ విద్యలు నేర్చుకోవడం కూడా ముఖ్యమన్నారు. ఈ సందర్భంగా గ్రేడింగ్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 30 మంది విద్యార్థులకు బెల్టులు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో న్యూ మాంక్స్ కుంగ్‌ఫూ రాష్ట్ర అసిస్టెంట్ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ నక్క బాల్‌రాజ్, మాస్టర్లు, ప్రిన్సిపాల్ నవీన్, శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత

షాద్‌నగర్‌రూరల్: మండల పరిధిలోని ఎలికట్ట గ్రామానికి చెందిన నక్క మాణెమ్మ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న అంబా భవానీ పొదుపు సంఘం అధ్యక్షుడు సంజీవయాదవ్ ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. పొదుపు సంఘంలో నక్క మాణెమ్మ సభ్యురాలు కావడంతో సంఘం తరఫున ఆర్థికసాయం అందజేసినట్లు సంజీవయాదవ్ తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రంగమ్మ, ఆశవర్కర్ లలిత, బద్దుల లక్ష్మయ్య, నక్క శ్రీశైలం, ఆర్ల లింగం, శ్రీలత తదితరులు పాల్గొన్నారు



బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న సంఘం సభ్యులు

ఆజాద్ సంఘం అధ్యక్షుడిగా మహ్మద్ ఖరీమ్

మొయినాబాద్‌రూరల్: మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ యూత్ అసోసియేషన్ హిమాయత్‌నగర్ అధ్యక్షుడిగా మహ్మద్ ఖరీమ్‌ను ఆ గ్రామ మైనార్టీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మైనార్టీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన అధ్యక్షుడిగా మహ్మద్ ఖరీమ్‌ను, ఉపాధ్యక్షుడిగా షేక్ రెహమత్‌లను ఎన్నుకొని వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం మైనార్టీ నాయకులు వారికి నియామక పత్రాలను అందజేసి పూలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవియాదవ్, జావిద్, ఆసీఫ్, రజాక్, వజీర్, మహ్మద్ జబ్బార్, మిరాజ్, మహేశ్, కుమార్, మల్లేశ్‌యాదవ్, గిరి, మైనార్టీ సభ్యులు పాల్గొన్నారు.



నూతన సభ్యులకు నియామకపత్రాలు అందజేస్తున్న మైనార్టీ నాయకులు

కనుల పండువగా మార్కండేయ రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న సంఘం సభ్యులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాం కాలనీలో పద్మశాలీ పరస్పర సహాయ సహకార పొదుపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీ భక్త మార్కండేయస్వామి రథయాత్ర ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని సంఘం ఆధ్వర్యంలో గత ఆరేళ్ల నుంచి ఈ రథయాత్ర నిర్వహిస్తున్నామని సంఘం సభ్యులు తెలిపారు. పద్మశాలీ సంఘ భవనం నుంచి ప్రారంభమైన ఈ రథయాత్ర శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామి ఆలయం వరకు కొనసాగింది. సోమవారం ఉదయం యజ్ఞోపవిత కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

రుణమాఫీపై విమర్శలు సరికాదు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: రైతుల రుణమాఫీ అంశంపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు విమర్శలు చేయడం సరికాదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రైతులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీమేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలతో పాటుగా రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. కొన్ని సాంకేతిక లోపాల కారణంగా కొన్నిచోట్ల రుణమాఫీ అమలులో సమస్యలు వచ్చాయన్నారు. షాద్‌నగర్‌లోని బరోడా బ్యాంక్‌లో 576 మంది రైతులకు రుణమాఫీ అమలులో సాంకేతిక సమస్యలు తలెత్తాయన్నారు. ఈ విషయాన్ని వెంటనే సీఎం రేవంత్‌రెడ్డితో పాటు వ్యవసాయశాఖ కమిషనర్, బ్యాంక్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సాంకేతిక సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం రూ.6కోట్లు రైతుల ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు బిల్లా, రంగాలుగా వ్యవహరిస్తూ రుణమాఫీపై లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని దోచుకొని ఇప్పుడు నీతులు వల్లించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వానికి రైతులందరూ సమానమేనని, అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అందుతుందన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌కు కూడా ప్రభుత్వం రుణమాఫీ చేసిందన్నారు. సమావేశంలో నాయకులు యాదయ్య యాదవ్, కొంకళ్ల చెన్నయ్య, తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న రైతులు

జేపీదర్గాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాం

కొత్తూరు: మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఉన్న ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాను పర్యాటక క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో ఇన్ముల్‌నర్వ వాసులతో మాట్లాడారు. దర్గా ఆవరణలో ఉన్న పీర్ల చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అయా ప్రాంతాల నుంచి దర్గాకు వచ్చే భక్తులకు దర్గా ఆవరణలో ఇప్పటివరకు బస్టాండ్ లేకపోవడంతో ఇబ్బందులు పడ్డట్లు వివరించారు. ప్రయాణికులు, భక్తుల సౌకర్యార్థం ఇక్కడ బస్టాండ్‌ను నిర్మించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా దర్గా అభివృద్ధిని పక్క ప్రణాళికతో చేపట్టనున్నట్లు వివరించారు. రైతులు, వ్యాపారులతో పాటు ఎవరికి నష్టం లేకుండా పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. దర్గాను అభివృద్ధి చేస్తే భక్తుల సంఖ్య పెరుగుతుందని, దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. అభివృద్ధి పనులకు వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యేను స్థానిక నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఆగీరు రవికుమార్‌గుప్తా, గోవర్ధన్‌గౌడ్, ఖాజా, బాబు, కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు సర్వాయి పాపన్నగౌడ్

బహుజన విప్లవకారుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని పురస్కరించుకొని చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వివిధ పార్టీలు, గౌడ సంఘాల నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పాపన్నగౌడ్ ఎంతో పోరాటం చేశారని, ఆయనను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు.



షాద్‌నగర్: పాపన్నగౌడ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



కొందుర్గు: చౌదరిగూడలో..



కేశంపేట: మండల కేంద్రంలో..



మొయినాబాద్‌రూరల్: బాకారంలో..



షాబాద్: షాబాద్‌లో..



చేవెళ్లలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య, నాయకులు



అంగడిబజారు కాలనీ మధ్యలో సంత నిర్వహించే స్థలంలో పాడైపోయిన కూరగాయలు

సంత.. వ్యర్థాలతో చింత

- పాడైన కూరగాయలను సంతలోనే వదిలేస్తున్న వ్యాపారులు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న అంగడిబజార్ కాలనీప్రజలు
- పట్టించుకోని తైబజార్ నిర్వాహకులు

చేవెళ్ల: వారంతపు సంతతో చుట్టూ ఉన్న కాలనీ ప్రజలను అపరిశుభ్రత సమస్య వేధిస్తోంది. ఈ సంత అనంతరం మళ్లీ సంత వరకు సంత పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని మండల కేంద్రంలోని అంగడిబజార్ కాలనీ ప్రజలు వాపోతున్నారు. ఆదివారం కాలనీ ప్రజలు సంత ఆవరణలో ఉన్న వ్యర్థాలను అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాలను విలేకరులకు చూపించి ఈ సమస్యను పరిష్కరించాలని కోరారు. అంగడిబజార్ కాలనీ మధ్యలో ఏన్నో ఏళ్ల నుంచి కూరగాయల సంత(అంగడి) కొనసాగుతోంది. ఇక్కడ అన్ని రకాల కూరగాయలతో పాటు నిత్యావసర వస్తువులు అన్ని ప్రజలకు అందుబాటులో దొరుకుతాయి. ప్రతీ గురువారం ఈ సంత జరుగుతుంది. అయితే కూరగాయల వ్యాపారులు కూరగాయలు అమ్మగా మిగిలిపోయిన వ్యర్థ పదార్థాలను అక్కడే వదిలేయటం లేదా పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పోసి వెళ్లిపోతున్నారు. మళ్లీ వారం రోజుల వరకు వీటిని తొలగించేవారు లేక అవీ అక్కడే ఉండి కుళ్లిపోతున్నాయి. దీంతో అ వ్యర్థాలపై పశువులు, పందులు తిరుగుతున్నాయి. ఓ వైపు వర్షాలు కూడా పడుతుండటంతో ఈ సంత జరిగే ప్రాంతం మొత్తం అపరిశుభ్రంగా మారుతోందని కాలనీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వ్యర్థాలతో అపరిశుభ్రంగా మారిన సంత పరిసరాలు

వ్యర్థాల నుంచి దుర్వాసన, ఈగలు, దోమల సైర్యవిహారం చేస్తున్నాయని వాపోతున్నారు. వీటితో రోగాల బారిన పడుతున్నామని అంటున్నారు. పంచాయతీలో, తైబజారు వేలం పాటలో దక్కించుకున్నవారు సంత నిర్వహణ పరిశుభ్రతపై దృష్టి సారించటం లేదని వాపోతున్నారు. దీనిపై అధికారులు, పాలకులు దృష్టి సారించి ఈ వారంతపు సంతతో ఎదురతువుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరుతున్నారు. గతంలో పంచాయతీ పాలకవర్గానికి చెబితే వారు వచ్చి శుభ్రం చేసి వెళ్లారు. కానీ ఇది ప్రతీ వారం జరుగుతూనే ఉంటుందని, నిర్వహణ బాధ్యతలను ఎవరికైనా అప్పగిపంచేలా చర్యలు తీసుకోవాలని కాలనీ ప్రజలు కోరుతున్నారు. లేదంటే ప్రతీ వారం ఈ సమస్య కాలనీ ప్రజలను వేధిస్తోందని వాపోతున్నారు. లేదంటే సంత నిర్వహించే సమయంలో వ్యాపారుల కోసం ప్రత్యేకంగా చెత్త డంపింగ్ స్థలాలను ఏర్పాటు చేసి వ్యర్థాలను అందులో వేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.